సాక్షి సంగారెడ్డి

బుధవారం । 23 । ఆగస్టు । 2023



సీఎంకు ఘనస్వాగతం పలుకుదాం

హైదరాబాద్ నుంచి పలు గ్రామాలగుండా మెదక్ సభకు వెళ్తున్న సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలుకుదామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి.. నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 10లో



మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం 11లో

బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. మంగళవారం టేక్మాల్ మండలంలోని పలు గ్రామాలకు చెంది న కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు.

నేడు జాబ్ మేళా

సంగారెడ్డి అర్బన్: నేడు జిల్లా ఉపాధి కార్యాలయ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత జిరాక్స్ కాపీలు తీసుకొని రావాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

చింతా ప్రభాకర్‌కు శుభాకాంక్షల వెల్లువ



చింతా ప్రభాకర్‌ను కలిసిన సంయుక్త స్కూల్ సిబ్బంది

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను కలిసి పలువురు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద సందడి నెలకొంది. ఆయనను కలిసిన వారిలో స్వర్ణకారుల సంఘం సభ్యులు, తాపీ మేస్త్రీల సంఘం, ఆర్‌పీలు, సంయుక్త ఇంటర్నేషనల్ స్కూల్ సిబ్బంది, కొండాపూర్ మండల, పట్టణానికి చెందిన నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పూజలు



కేతకీలో పూజలు చేసిన ఎమ్మెల్యే, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్ జహీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన పేరు ప్రకటించడం తెలిసిందే. దీంతో మంగళవారం ఆలయానికి చేరుకోగా ఆలయ అర్చకులు, అధికారులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కూంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందించి, పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాచయ్యస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశం, ప్రజాప్రతినిధులు జగదీశ్వర్, పరమేశ్వర్ పాటిల్, అమర్‌జిత్, నాయకులు ఎజాజ్ బాబా, సంతోష్ కుమార్ పాటిల్, నాగన్న, బస్వరాజ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి సర్పంచ్‌ల సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రకాశ్‌చారి

జిన్నారం(పటాన్‌చెరు): మూడోసారి పటాన్‌చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన మహిపాల్‌రెడ్డిని సర్పంచ్‌లు సన్మానించారు. గడ్డపోతారం సర్పంచ్ ప్రకాశ్‌చారి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మంగళవారం సన్మానించారు. మూడోసారి ఎమ్మెల్యేగా మహిపాల్‌రెడ్డి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారని ఈ సందర్భంగా వారు ధీమా వ్యక్తం చేశారు.

జాతీయ సదస్సుకు ఎంఈఓ ఎంపిక



దండు అంజయ్య

సదాశివపేట(సంగారెడ్డి): ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు రాజస్తాన్ మౌంట్‌అబులోని బ్రహ్మకుమారి సంస్థలో జరిగే జాతీయ సదస్సుకు ఎంఈఓ దండు అంజయ్య ఎంపికయ్యారు. విద్యా, నైతిక, అధ్యాత్మిక విలువలు రాజయోగ మెడిటేషన్ అంశంపై ప్రసంగించనున్నట్లు అంజయ్య మంగళవారం తెలిపారు. ఆయనను జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్: విదేశీ విద్య అభ్యసించే మైనార్టీ విద్యార్థులు ముఖ్యమంత్రి ఉపకార వేతనం కోసం దరఖాస్తులు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమాధికారి దేవుజ మంగళవారం తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో సెప్టెంబర్ 21వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న అన్ని ధ్రువ పత్రాలను జిల్లా మైనార్టీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు 9032171538 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సారొస్తున్నారు..

- సీఎం చేతులమీదుగా కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్‌ఎస్ కార్యాలయాలు ప్రారంభోత్సవం
- ఏర్పాట్లను పరిశీలించిన హరీశ్‌రావు, పద్మాదేవేందర్‌రెడ్డి
- పట్టణంలో భారీ కటౌట్లు, తోరణాలు

మెదక్: సీఎం మెదక్ టూర్ కోసం జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. నూతనంగా నిర్మించిన కలెక్టరేట్, పోలీస్, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలను బుధవారం సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు మంగళవారం మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ఆయా కార్యాలయాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. బీఆర్‌ఎస్ కార్యాలయం ఎంట్రెన్స్‌ను ఆర్చ్‌తో నిర్మించాలని, బహిరంగ సభకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శినికి ఆదేశాలు జారీ చేశారు. కాగా పార్టీ శ్రేణులు పట్టణంలో భారీ కటౌట్లు, స్వాగత తోరణాలతో అలంకరించారు. సీఎం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఇక్కడికి రానున్నారు. గుమ్మడిదలలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆయనకు స్వాగతం పలుకుతారు. తర్వాత కౌడిపల్లి, నర్సాపూర్ మీదుగా నేరుగా మెదక్ వస్తారు.

షెడ్యూల్ ఇలా...

ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరుతారు. మధ్యాహ్నం 1 గంటకు బీఆర్‌ఎస్ కార్యాలయం, 1.20 ఎస్పీ, 1.40 కలెక్టరేట్ ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు చర్చి గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.



విద్యుత్ కాంతుల్లో సమీకృత భవనం





బహిరంగ సభకు ఏర్పాట్లు

అసంతృప్తులకు బుజ్జగింపులు

- స్వయంగా మాట్లాడిన మంత్రి హరీశ్‌రావు
- సముచిత స్థానం కల్పిస్తామని భరోసా
- అధినేత నిర్ణయానికి కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) టిక్కెట్లు ఆశించి భంగపడిన నాయకులకు బుజ్జగింపుల పర్వం కొనసాగుతోంది. వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు స్వయంగా రంగంలోకి దిగి అసంతృప్త నేతలతో మాట్లాడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 115 అసెంబ్లీ సెగ్మెంట్లకు సీఎం కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించారు. ఒక్క నర్సాపూర్ అభ్యర్థి ఎంపిక పెండింగ్‌లో పెట్టారు. దీంతో మెదక్‌తోపాటు, జహీరాబాద్, పటాన్‌చెరు తదితర నియోజకవర్గాల్లో టిక్కెట్టు రాని నేతల నుంచి అసంతృప్త స్వరాలు వినిపించాయి. పటాన్‌చెరు టిక్కెట్టు ఆశించిన నీలం మధు సోమవారం తన అనుచరులతో సమావేశం నిర్వహించారు. నీలం మధుతో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. కేసీఆర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. తన లాంటి యువ నాయకత్వం పార్టీకి అవసరమని, రాబోవు రోజుల్లో సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇటు జహీరాబాద్ టిక్కెట్టు ఆశించిన ఢిల్లీ వసంత్‌కు భవిష్యత్‌లో నామినేటెడ్ పోస్టు ఇస్తామని భరోసా కల్పించారు. వసంత్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సైతం కలిశారు. ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన నరోత్తంతోనూ మంత్రి మాట్లాడినట్లు సమాచారం. మెదక్ అభ్యర్థిత్వం ఆశించిన ఎమ్మెల్సీ, కేసీఆర్ రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్‌రెడ్డిని కూడా బుజ్జగించారు.

క్రమంగా చల్లారుతున్న అసమ్మతి

పార్టీ బలంగా ఉన్న జిల్లాల్లో టిక్కెట్టు ఆశించే నేతలు ఎక్కువగా ఉంటారని, అభ్యర్థుల ప్రకటనతో అసంతృప్తులు తెరపైకి రావడం సాధారణమే. టిక్కెట్టు దక్కని నాయకుల నుంచి కీలక నిర్ణయాలు తీసుకునేందుకు సైతం సిద్ధమనే సంకేతాలు పెద్దగా లేకపోవడంతో.. ఈ అసంతృప్తులు కొద్ది రోజుల్లోనే సద్దుమణుగుతాయనే ధీమా బీఆర్‌ఎస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

అసంతృప్త నేతల వద్దకు వెళ్లి కలవండి

ఆయా నియోజకవర్గ అభ్యర్థులే అసంతృప్త నేతలను కలుపుకొని పోవాలని కేసీఆర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. బుధవారం సీఎం మెదక్ పర్యటన నేపథ్యంలో పార్టీ నాయకత్వం అంతా జనసమీకరణలో తలమునకలు అయ్యింది. సభ అనంతరం అభ్యర్థులు, అసంతృప్త నేతలతో వచ్చే ఎన్నికల్లో కలిసి పనిచేసేలా విజ్ఞప్తి చేయనున్నారు.

సదుపాయాల కల్పనలో రాజీపడొద్దు

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అఖిలేష్ రెడ్డి



రికార్డులు తనిఖీలు చేస్తున్న డీడీ

పుల్‌కల్(అందోల్): వసతి గృహాల్లోని విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడకూడదని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి వార్డెన్‌లకు సూచించారు. మంగళవారం పుల్‌కల్ ఎస్సీ వసతి గృహంలో జోగిపేట ఏఎస్ డబ్ల్యూ శంకర్‌తో కలసి తనిఖీలు చేశారు. ఆపై వసతి గృహం గదులను పరిశీలించారు. వాష్ రూం తలుపులకు మరమ్మతు చేయించాలని వార్డెన్ మాణయ్యకు సూచించారు. చదువుపై దృష్టి కేంద్రీకరించి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీలు చేశారు.

ముదిరాజ్‌లపై శీతకన్ను



మాట్లాడుతున్న టప్ప కుమార్, సంఘం సభ్యులు

- సంఘం జిల్లా అధ్యక్షుడు టప్ప కుమార్
- అంబేడ్కర్ విగ్రహానికి వినతి

పటాన్‌చెరు టౌన్: బీఆర్‌ఎస్‌కు ముదిరాజ్ అంటేనే చిన్నచూపని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు టప్ప కుమార్ విమర్శించారు. ముదిరాజ్‌లను దూషించిన కౌశిక్ రెడ్డికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని అన్నారు. రాష్ట్రంలో 60 లక్షలపైగా జనాభా ఉన్న ముదిరాజ్‌లను ఒక్క సీటూ కేటాయించకపోవడం దారుణమన్నారు. మంగళవారం పట్టణంలోని ముదిరాజ్ భవన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టప్ప కుమార్, సంఘం సభ్యులు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం బీఆర్‌ఎస్ పావులాగా వాడుకుంటుందే తప్ప, ముదిరాజ్‌లకు చేసింది ఏమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో పటాన్‌చెరు నుంచి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్‌కు టిక్కెట్ వస్తుందని ఆశించామని అన్నారు. ఇప్పటికైనా ముదిరాజులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ సైతం ముదిరాజ్‌లకు ఐదు నుంచి పది సీట్లు రాష్ట్రంలో కేటాయించాలన్నారు. తొలుత ముదిరాజ్ భవన్ నుంచి ర్యాలీగా వెళ్లి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జలగరి ఎట్టయ్య, సడబోయిన అంజయ్య, పెద్ద బోయిన బాల్రాజ్ పాండు ముదిరాజ్, నాగసాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా

కలెక్టర్ డాక్టర్ శరత్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి, ఏమైనా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 19 లోగా తెలియజేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ కోరారు. ఈనెల 21న జిల్లాలో ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశామని, ఐదు నియోజకవర్గాలలో మొత్తం 12,40,016 జనరల్ ఓటర్లు, 357 సర్వీస్ ఓటర్లు, 64 ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ముసాయిదాను పరిశీలించి ఓటరుగా పేరు లేకపోవడం, తప్పుల సవరణ, లిస్టులో ఉన్నటువంటి పేర్లపై ఆక్షేపణలు, అభ్యంతరాలను సెప్టెంబర్ 19 వరకు స్వీకరిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 28 లోగా పరిష్కరిస్తామని తెలిపారు. అక్టోబర్ 4న తుది జాబితాను ప్రచురిస్తామన్నారు. ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే నిర్ణీత సమయంలోగా అందజేయాలన్నారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం-6, తప్పొప్పుల సవరణకు ఫారం-8 అని తెలిపారు. ఓటర్ల జాబితాలోని పేర్లపై ఆక్షేపణలు, వలస పోయిన, చనిపోయిన వారి వివరాలు తెలపడానికి ఫారం-7 ను వినియోగించుకోవాలని సూచించారు.

ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని నారాయణఖేడ్ నియోజకవర్గంలో 2,05,410 జనరల్ ఓటర్లు, 67 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 2,21,294 జనరల్ ఓటర్లు, 65 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అందోల్ నియోజకవర్గంలో 2,28,399 జనరల్ ఓటర్లు, 48 మంది సర్వీస్ ఓటర్లు, 5 గురు ప్రవాస ఓటర్లు(ఎన్ఆర్ఐలు) ఉన్నారన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో 2,44,969 జనరల్ ఓటర్లు, 103 మంది సర్వీస్ ఓటర్లు, ముగ్గురు ప్రవాస ఓటర్లు ఉన్నారన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 3,39,944 జనరల్ ఓటర్లు, 74 మంది సర్వీస్ ఓటర్లు, 56 మంది ప్రవాస ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఈనెల 26, 27న, సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉందన్నారు.

26న మెగా ప్లాంటేషన్

ఈనెల 26న ఒక కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా జిల్లాలో అన్ని ఏర్పాట్లూ చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురితో కలిసి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు ఈనెల 26న మెగా ప్లాంటేషన్‌కు అన్ని ఏర్పాట్లూ చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి మున్సిపాలిటీ, మండలం , అసెంబ్లీ నియోజకవర్గం, గ్రామపంచాయతీలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. సమీక్షలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ సురేష్ మోహన్, బీసీ సంక్షేమ అధికారి జగదీష్, మైనార్టీ సంక్షేమ అధికారి దేవుజా, డీఆర్‌ఓ నగేష్ పాల్గొన్నారు.

పరిహారం అందేదెప్పుడో?

వేసవిలో రెండు సార్లు వచ్చిన భారీ తుపానుల వల్ల జిల్లాలో 6,409 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. రైతాంగానికి ఎకరాకు రూ.10వేలు పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సంగమంది రైతులకు పరిహారం అందలేదు.

- జిల్లాలో 6,409 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తింపు
- 4,047 ఎకరాలకే పరిహారం అందజేత
- ఆందోళనలో రైతులు


జహీరాబాద్: మార్చిలో కురిసిన వడగళ్ల వానకు జిల్లాలో 4,047 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 3,093 మంది రైతులు నష్టపోయారు. వీరికి మాత్రమే అధికారులు పరిహారం అందించారు. ఎకరాకు రూ.10వేల వంతున రూ. 4.05 కోట్ల మేర పరిహారాన్ని చెల్లించారు. ఏప్రిల్‌లో భారీ వర్షాల వల్ల కూడా అపార నష్టం వాటిల్లింది. దీంతో వ్యవసాయ శాఖ వెంటనే నష్టాన్ని సర్వే చేసి నివేదికలు ప్రభుత్వానికి పంపింది.

జిల్లాలో 6,409 ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలో రెండుసార్లు అకాల వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా 6,409 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. మార్చి16, 17వ తేదీల్లో కురిసిన వర్షాలకు 4,047 ఎకరాల్లో నష్టం జరిగినట్లు గుర్తించారు. జహీరాబాద్ మండలంలో 374.24 ఎకరాల్లో, మొగుడంపల్లి మండలంలో 154.37, కోహీర్ మండలంలో 1794.16, ఝరాసంగం మండలంలో 451.11, న్యాల్‌కల్ మండలంలో 206.06, రాయికోడ్ మండలంలో 37.25 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. మునిపల్లి మండలంలో 95.23 ఎకరాల్లో, వట్‌పల్లి మండలంలో 2.15, సదాశివపేట మండలంలో 183.01, కంది మండలంలో 8.06, అందోల్ మండలంలో 20.18, కల్హేర్ మండలంలో 5, కంగ్టి మండలంలో 341.18, మనూర్ మండలంలో 26.38, నాగల్‌గిద్ద మండలంలో 12.10 ఎకరాల్లో నష్టం జరిగినట్లు నిర్ధారించారు. ఒక్క జహీరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యధికంగా 2,981 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 2,112 మంది రైతులు నష్టపోయారు.

ఏప్రిల్ నెల 27 నుంచి కురిసిన భారీ వడగళ్ల వర్షాలకు 2,362 ఎకరాల్లో పంట నష్టం అధికారులు జరిగినట్లు గుర్తించారు. ఇందులో కోహీర్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోనే అధికంగా నష్టం వాటిల్లింది. ఈ మూడు మండలాల్లోనే 1,426 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. కోహీర్ మండలంలో 655 ఎకరాలు, జహీరాబాద్ మండలంలో 612 ఎకరాలు, మొగుడంపల్లి మండలంలో 159 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. రెండు సార్లు కురిసిన భారీ వర్షాలు జహీరాబాద్ డివిజన్‌పైనే అత్యధిక ప్రభావం చూపాయి. పూర్తిగా సాగు చేసిన మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, తెల్ల కుసుమ, శనగ పంటలతో పాటు బొప్పాయి, అరటి, టమాటా, ఉల్లిగడ్డ తదితర పంటలు దెబ్బతిన్నాయి.

నిధులు రాగానే అందజేస్తాం



రెండు సార్లు భారీ వర్షాలు పడటంతో జిల్లాలో యాసంగిలో సాగులో ఉన్న పంటలు దెబ్బతిన్నాయి. మార్చిలో కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం రైతుల ఖాతాల్లో జమచేశాం. ఏప్రిల్‌లో జరిగిన పంట నష్టానికి సంబంధించిన పరిహారం ఇంకా విడుదల కాలేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే మిగతా రైతులకు కూడా వారి ఖాతాల్లో జమచేస్తాం.

–నర్సింహారావు, జేడీఏ సంగారెడ్డి



ఖానాపూర్‌లో నేలవాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జేడీఏ నర్సింహారావు (ఫైల్)

క్లుప్తంగా

కాటేసిన కరెంట్ వైరు


పొలంలో మృతదేహం

హవేళీఘనపూర్ (మెదక్): పశువుల మేతకు గడ్డి కోసం వెళ్లిన ఓ యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొల్లూరి ఎల్లయ్య(38) గ్రామ శివారులోని కొల్లూరి సురేశ్ పొలంలోకి గడ్డి కోసుకొచ్చేందుకు వెళ్లాడు. అయితే పంట రక్షణ కోసం పెట్టిన కరెంట్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. హవేళీఘనపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు


దానురెడ్డి (ఫైల్)

శివ్వంపేట (నర్సాపూర్): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు.ఈ సంఘటన మండల పరిధి కొత్తపేటలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బిగ్గాల దానురెడ్డి(60) తన వ్యవసాయ పొలం వద్ద బోరుమోటారు ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఈ విషయంలో పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

స్నానానికి కుంటలోకి దిగి వ్యక్తి మృతి


రవి

పటాన్‌చెరు టౌన్: స్నానానికి కుంటలోకి దిగిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ అంబేడ్కర్ కాలనీకి చెందిన రవి(41) డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 19వ తేదీన ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆచూక కోసం కుటుంబ సభ్యులు గాలిస్తుండగా.. సోమవారం సాయంత్రం ఇస్నాపూ ర్ గ్రామంలోని సంగమేష్ కుంట ఒడ్డున ఓ వ్య క్తి బట్టలు కనిపించాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి చూడగా నీటిపై తేలి ఉన్న వ్యక్తిని రవిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

లైంగికదాడి కేసును ఛేదించిన పోలీసులు


ఎస్‌ఐకి రివార్డును అందిస్తున్న సీపీ శ్వేత

జగదేవ్‌పూర్ (గజ్వేల్): బాలికపై అత్యాచారం కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రైవేట్ వెంచర్‌లో ఓ ప్రేమజంట ఈనెల 7న ఉండగా, తాను పోలీసునంటూ బెదిరించి యువకుడిపై దాడి చేసి.. అమ్మాయిని తీసుకెళ్లి అత్యాచారం చేసిన విషయం విదితమే. ఈ కేసును త్వరగా ఛేదించడానికి కమిషనర్ శ్వేత.. గజ్వేల్ ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. టెక్నాలజీ ద్వారా చాకచక్యంగా నిందితుడిని గుర్తించారు. హైదరాబాద్‌లోని బోడుప్పల్ యాదవ బస్తీకి చెందిన చింతల చందు (45) అని గుర్తించారు. ఇతను చేపల వ్యాపారం చేస్తాడు. నిందుతుడిని అరెస్టు చేయడంతో మంగళవారం ఏసీపీ, సీఐ, ఎస్‌ఐ, పోలీస్‌సిబ్బందిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఏఎన్ఎంల పోరుబాట


సంగారెడ్డిలోని డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఏఎన్ఎంల నిరసన

18 ఏళ్లుగా వైద్య విభాగంలో రెండో, ఈసీ, అర్బన్ ఏఎన్ఎంలు చాలీచాలనీ వేతనాలతో పని చేస్తున్నారు. ఫస్ట్ ఏఎన్ఎంలతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా వేతనాలలో వ్యత్యాసం ఉంది. కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో కుటుంబాలకు దూరంగా ఉండి విధులు నిర్వహించారు. నాడు వీరి సేవలను ప్రభుత్వం కొనియాడింది. నేడు సేవలు ఇక చాలని పక్కన పెట్టే ప్రయత్నం చేస్తోంది. ఇటీవల ఖాళీగా ఉన్న ఏఎన్ఎంల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడంతో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు ఆగ్రహానికి గురయ్యారు.

- రెగ్యులర్ చేయాలని డిమాండ్
- భర్తీ నోటిఫికేషన్ రద్దు చేయాలి
- వారం రోజులుగా సమ్మె

కొండాపూర్(సంగారెడ్డి): కొన్నేళ్లుగా కాంట్రాక్ట్ విభాగంలో పని చేస్తున్న రెండో, ఈసీ, అర్బన్ ఏఎన్ఎంలు రెగ్యులరైజ్ చేయాలన్న డిమాండ్‌తో వారం నుంచి సమ్మె చేస్తున్నారు. జిల్లాలో 30 పీహెచ్‌సీలు, 5 అర్బన్ పీహెచ్‌సీ కేంద్రాలున్నాయి. వీరిలో ఈసీ, ఏఎన్ఎంలు 160, అర్బన్ ఏఎన్ఎంలు 25, సెకండ్ ఏఎన్ఎంలు 460 మంది ఉన్నారు. మొత్తంగా 570 మంది ఏఎన్ఎం లు కాంట్రాక్ట్ విభాగంలో పని చేస్తున్నారు. 2008 నుంచి వైద్య ఆరోగ్య శాఖలో ఫస్ట్ ఏఎన్ఎంలకు సహాయకులుగా ఉండేలా కాంట్రాక్ట్ విభాగంలో రెండో, ఈసీ, అర్బన్ ఏఎన్ఎంలను విధుల్లోకి తీసుకున్నారు. కానీ ప్రభుత్వం ఏఎన్ఎంలను ప్రతి పనికీ వినియోగించుకుంటోంది. కరోనా సమయంలో ఈ ఏఎన్ఎంలు లేకుంటే పరిస్థితి మరోలా ఉండేదని తెలుస్తోంది. వీరు వ్యాక్సిన్‌ను ప్రతి ఇంటికీ తిరిగి అందించారు. అలాంటి వారిని ప్రభుత్వం పక్కన పెట్టింది. దీంతో మనోవేదనకు గురౌతున్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే బతుకులు బాగు పడతాయి. కాంట్రాక్ట్ ఉద్యోగాలన్ని పర్మినెంట్ అవుతాయనే ఆశతో ఉద్యమంలో ముందుండి పోరాడారు. స్వరాష్ట్రం వచ్చి 9 ఏళ్ల పూర్తవుతున్నా, పర్మినెంట్ అవుతుందనే కల.. కలగానే మిగిలిపోయింది. అయితే ఫస్ట్ ఏఎన్ఎం, సెకండ్ ఏఎన్ఎంల వేతనంలోనూ భారీ తేడా ఉంది. చేసే పని ఒకటే అయినప్పటికీ సెకండ్ ఏఎన్ఎంలకు రూ.25 వేలు కాగా, ఫస్ట్ ఏఎన్ఎంలు రూ.లక్ష వరకు వేతనాలు తీసుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏఎన్ఎంల భర్తీ కోసం వేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, ప్రస్తుతం కాంట్రాక్ట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలతో భర్తీ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు సమ్మెను ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు.

రెగ్యూలర్ చేయాలి:

16 ఏళ్లుగా చాలీచాలని వేతనాలు. ప్రభుత్వం ఏ పనీ అప్పగించిన చిత్త శుద్ధితో చేస్తున్నాం. ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను చేరవేసేందుకు ఎంతో కృషి చేస్తున్నాం. అయినా మా బాధలు సర్కారుకు పట్టడం లేదు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో మమ్మల్ని భర్తీ చేయాలి. గత కొన్ని సంవత్సరాలుగా రెగ్యూలరైజ్ చేస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నాం. ఫస్ట్ ఏఎన్ఎంలతో సమానంగా పని చేస్తున్నాం. హైకోర్టు తీర్పు ప్రకారం వేతనం చెల్లించాలి.

– మాదవి, అర్బన్ ఏఎన్ఎం

గజ్వేల్ అభివృద్ధి బాగుంది


గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్ద మహారాష్ట్ర ప్రతినిధుల బృందం

- మహారాష్ట్ర ప్రతినిధుల బృందం కితాబు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి బాగుందని మహారాష్ట్రకు చెందిన ప్రతినిధుల బృందం కొనియాడింది. మండల పరిధిలోని కోమటిబండగుట్టపై నిర్మించిన మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్‌తో పాటు పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ కూరగాయల మార్కెట్‌ను మంగళవారం బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా వ్యవస్థను అక్కడి అధికారులు మహారాష్ట్ర ప్రతినిధుల బృందానికి వివరించగా, పట్టణంలోని కూరగాయల మార్కెట్లో క్రయ, విక్రయాల తీరుతెన్నులను స్థానిక అధికారులు వారికి వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గజ్వేల్ అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుందని, సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయన్నారు.

సీఎంకు ఘన స్వాగతం పలుకుదాం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పిలుపు
- జిన్నారం, గుమ్మడిదల మండలాల కార్యకర్తలతో సమావేశం
- ముదిరాజ్‌లకు అండగా ఉంటామని భరోసా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): హైదరాబాద్ నుంచి గుమ్మడిదల మండలంలోని పలు గ్రామాల గుండా మెదక్ సభకు వెళ్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఘనంగా స్వాగతం పలుకుదామని, ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మెదక్‌లో జరిగే సీఎం సభకు జన సమీకరణతో పాటు గుమ్మడిదల ప్రధాన రహదారిపై ఉన్న టోల్‌గేట్ సమీపంలో కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే మంగళవారం జిన్నారం, గుమ్మడిదల మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. మెదక్ సభకు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గుమ్మడిదల మండలంలోని అన్నారం, దోమడుగు, బొంతపల్లి, గుమ్మడిదల, మంబాపూర్ గ్రామాల మీదుగా సీఎం కేసీఆర్ రోడ్డు మార్గంలో మెదక్‌కు వెళ్లనుండటంతో టోల్‌గేట్ సమీపంలో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పర్యవేక్షించారు. అనంతరం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన గుమ్మడిదల మండలంలోని ముఖ్యమైన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సీఎంను కోరతానన్నారు. నియోజకవర్గంలో కొందరు టికెట్ ఆశించటంలో తప్పులేదని, ముదిరాజ్‌లను తాము పక్కన పెట్టినట్లు కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ముదిరాజ్‌లకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని, నియోజకవర్గంలో ముదిరాజ్‌లకు తాము అండగా ఉన్నామన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఇందెల సురేందర్ రెడ్డి, హుస్సేన్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపేశా.. వచ్చి శవం తీసుకెళ్లండి!

- ఆమె బంధువుకు ఫోన్
- బావిలో శవమై తేలిన వివాహిత
- భర్తపై కేసు నమోదు


రేణుక మృతదేహం

నారాయణఖేడ్: "రేణుకను చంపేశాను.. వెంటనే వచ్చి శవం తీసుకెళ్లండి'అని ఓ వ్యక్తి తన భార్య బంధువుకు ఫోన్ చేశాడు. ఈ సంఘటన నారాయణఖేడ్ మండలం సిర్గాపూర్ మండలంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని వాసర్‌కు చెందిన రేణుక (22)కు, నారాయణఖేడ్ మండలం జూకల్‌కు చెందిన కుందేలు శర్ణప్ప (25)తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. శర్ణప్ప తరచూ ఆమెను మానసికంగా వేధించేవాడు. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టించినా అతనిలో మార్పురాలేదు. ఇటీవల వేధింపులు మరీ ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి రేణుక బంధువైన జగదేవికి శర్ణప్ప చేశాడు. రేణుకను చంపేశాను, వచ్చి శవం తీసుకెళ్లండని చెప్పడంతో ఆమె కంగుతిన్నది. మంగళవారం ఉదయం బంధువులు వచ్చి వెతకగా గ్రామ శివారులోని బావిలో రేణుక మృతదేహం లభించింది. రేణుకను భర్త, అతని కుటుంబ సభ్యులే హత్య చేసి బావిలక్ష పడేశారని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు.

లైసెన్స్ లేకుంటే వాహనాల సీజ్

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక తనిఖీలు
- ఇటీవల మైనర్లపై 18 కేసులు


వాహనాలను తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సంగారెడ్డి టౌన్ : డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నారు. మద్యం తాగి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలు బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో పోలీస్ శాఖ అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా లైసెన్స్ రహిత వాహనాలను సీజ్ చేస్తున్నారు. వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలంటున్నారు. తల్లిదండ్రులు మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దని జాగృతం చేస్తున్నారు. వారికి ఇస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు చేస్తున్నారు. అంతే కాదు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రాణ నష్టం జరుగుతోందని నివారణలో భాగంగా చోదకులపై కేసు నమోదు చేస్తున్నారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ ఉంటేనే వాహనాలను నడపాలని పోలీసులు పేర్కొంటున్నారు. రోడ్డు ప్రమాదాలతో ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డ సంఘటనలను పట్టుబడిన వారికి వివరిస్తున్నారు. ఇటీవల మైనర్లపై 18 కేసులు నమోదు చేశారు. వారి తల్లిదండ్రులతో కౌన్సెలింగ్ ఇప్పించారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసు నమోదు



మైనర్లకు వాహనాలిస్తే కేసులు పెడతాం. తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే సీజ్ చేస్తాం. ట్రాఫిక్ నియమాలు తెలిసి ఉండటంతో పాటు మద్యం తాగి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవు. రోజూ ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించకూడదు.

– సదానాగరాజు.. సీఐ, ట్రాఫిక్ సంగారెడ్డి

నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలి

- ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు నారాయణ
- మంత్రి హరీశ్‌రావుకు వినతి


మంత్రి హరీశ్‌రావుతో నారాయణ

వట్‌పల్లి (అందోల్): ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యం కల్పించాలని ఆ సంఘం ఉపాధ్యక్షుడు నారాయణ మంగళవారం మంత్రి హరీశ్‌రావుకు విన్నవించారు. బీఆర్ఎస్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ఒక్కరికి కూడా అవకాశం కల్పించలేదని, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లోనైనా తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ నెల 23న మెదక్ జిల్లాలో నిర్వహించే సీఎం సభలో ముదిరాజ్‌ల ప్రస్తావన తీసుకొచ్చి ముదిరాజ్‌ల సమస్యలపై ప్రస్తావించేలా కృషి చేయాలని మంత్రిని విన్నవించారు. అదేవిధంగా ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని కోరారు. మత్స్య సంరక్షణ చట్టం, ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు కేటాయించి తెలంగాణ మత్స్యశాఖకు రూ.3వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

నీలం మధుకు టిక్కెట్ కేటాయించాలి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఆర్ఎస్ నేత నీలం మధును గుర్తించకపోవడం బాధాకరమని ఎన్ఎంఆర్ యువసేన సీనియర్ నాయకులు రవిచారి, బాలకృష్ణ, రమేశ్ అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో మంగళవారం అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎన్ఎంఆర్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ బలోపేతం కోసం నీలం మధు ఎంతో కృషి చేశారన్నారు. అధిష్టానం మరోసారి పునరాలోచించి నీలం మధు ముదిరాజ్‌కు పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, నరేష్, మహేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే రఘునందన్‌రావు


దౌల్తాబాద్ మండలం లింగాయపల్లి తండాలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాయపోలు (దుబ్బాక): నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. దౌల్తాబాద్ మండలం లింగాయపల్లి తండాలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మంగళవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిధులు సాధించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు అధికంగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవి, ఎంపీటీసీ లక్ష్మీనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన ఇందుప్రియాలలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన చిన్నారులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

దూసుకొచ్చిన మృత్యువు

- యూరియా కోసం వెళ్తుండగా రైతు మృతి

నిజాంపేట (మెదక్): ఓ రైతు యూరియా కోసం వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన నిజాంపేట మండల కేంద్రానికి సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. నస్కల్ గ్రామానికి చెందిన రైతు గుమ్ముల రాజు (35) వరినాటుకు యూరియా సంచుల కోసం టీవీఎస్ మోపెడ్‌పై భూంపల్లి వెళుతున్నాడు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న టాటా ఏసీ వాహనం దూసుకొచ్చి మోపెడ్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

గిరిజన వివాహిత యువతి ఆత్మహత్య


శిరీష మృతదేహం

రామాయంపేట (మెదక్): ఓ గిరిజన యువతి ఆత్మహత్యకు పాల్పడింది. నల్లగొండ జిల్లా చావ్లా తండాకు చెందిన ధనావత్ సైదా తన భార్య శిరీష (22)తో కలిసి మెదక్ జిల్లా రామాయంపేటలో నివాసం ఉంటున్నాడు. అతను ఇంట్లో లేని సమయంలో శిరీష క్రిమి సంహారక మందు తాగి భర్తకు ఫోన్‌చేసి చెప్పింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం నార్సింగిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో యువకుడి..

కొండపాక (గజ్వేల్): ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కొండపాక మండలం అంకిరెడ్డిపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మేర్గోజు చంద్రమౌళి, రాణి దంపతుల పెద్ద కుమారుడు కృపాచరణ్ కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కానరాక ఇంట్లోని గదిలో ఉరి వేసుకొని మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె


సమ్మె చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు

జహీరాబాద్ టౌన్: అద్దె బస్సు డ్రైవర్లు సమ్మె చేయడంతో పల్లె బస్సులు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జహీరాబాద్ డిపోలో సుమారు 30 వరకు ప్రైవేట్ బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్సులు జహీరాబాద్ పట్టణం నుంచి సంగారెడ్డి, బీదర్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. 60 మంది అద్దె బస్సు డ్రైవర్లు సమ్మెకు దిగడంతో మంగళవారం డిపోలో ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోయాయి. డిపో మేనేజర్ తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ డ్రైవర్లు సమ్మె చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ నారాయణ మాట్లాడుతూ అద్దె బస్సు డ్రైవర్, కర్నాటక ఆర్టీసీ బస్సు డ్రైవర్లు గొడవ పడ్డారని, ఈ విషయంలో కర్నాటక బస్సు డ్రైవర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ముగ్గురిపై కేసు నమోదు అయిందన్నారు. ఆ డ్రైవర్లను డ్యూటీలోకి తీసుకోమని ముందస్తు సమాచారం లేకుండా సమ్మెకు దిగారని చెప్పారు. అద్దె బస్సు డ్రైవర్లు సమ్మె చేయడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నామని చెప్పారు.

న్యాయం చేయాలి

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి
- కంపెనీ ఎదుట గ్రామస్తుల ఆందోళన


కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు


సంపత్‌కుమార్ (ఫైల్)

మర్కూక్ (గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి కుటుంబానికి న్యాయం చేయాలని మంగళవారం గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం పోతారం వద్ద బస్సు ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం వర్దరాజ్‌పూర్‌కు చెందిన సంపత్‌కుమార్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే.. బైక్ నుంచి మంటలు చెలరేగడంతో బస్సు పూర్తిగా దగ్ధం అయింది. సంపత్‌కుమార్ తుర్కపల్లిలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజువారిలాగే ఉదయం కంపెనీకి బైక్‌పై వెళుతుండగా జూడస్ కంపెనీకి చెందిన బస్సు కర్కపట్ల వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని సుమారు 500 మీటర్ల వరకు రోడ్డుపై లాక్కెళ్లింది. దీంతో బైక్ నుంచి మంటలు చెలరేగి బస్సుకు అంటుకోవడంతో పూర్తిగా దగ్ధమైంది. బస్సులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే డ్రైవర్ చాకచక్యంతో ప్రాణాలతో బయటపడ్డాడు. కాగా, మృతుడి కుటుంబ సభ్యులు జూడస్ కంపెనీ ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. న్యాయం చేస్తామని కంపెనీ యాజమాన్యం హామీ ఇవ్వడంతో వారు ఆందోళనను విరమించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఓవ్యక్తి మెట్లు దిగుతూ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లాకు చెందిన మల్లయ్య(45) జీవనోపాధి కోసం రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీకి వలస వచ్చాడు. పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, ఈనెల 20న రాత్రి 10 గంటల సమయంలో మెట్లు దిగుతుండగా మల్లయ్య కాలు జారి కిందపడి గాయపడ్డాడు. అతడిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు.

కుంటలో పడి యువకుడి మృతి

తొగుట (దుబ్బాక): ప్రమాదవశాత్తు కుంటలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన తొగుట మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దాకని నర్సయ్య, లక్ష్మీ దంపతుల పెద్ద కుమారుడు స్వామి (22) కూలి పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. ఈ క్రమంలో రోజూ మాదిరిగా ఉదయం కూలి పనికి వెళ్లాడు. సాయంత్రం కాళ్లుచేతులు కడుక్కునేందుకు గ్రామ సమీపంలోని బతుకమ్మ కుంటలోకి దిగాడు. ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. చేతికందిన కొడుకు మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.